## క్లుప్తంగా...

### అమ్మవారికి బోనం సమర్పించిన మాజీ కార్పొరేటర్



అమీర్‌పేట: అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి బల్కంపేట ఎల్లమ్మకు బోనం సమర్పించారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్ మహిళా నాయకులతో కలిసి ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించారు. అమ్మవారి గర్భగుడిలో పూజలు నిర్వహించిన ఆమెకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



సికింద్రాబాద్‌లో పర్యటిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుధాంశ్

సికింద్రాబాద్: వర్షాల నేపథ్యంలో సర్కిల్ పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ్ అన్నారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనితీరు, వరద నీటి నిలువలు ఉన్న ప్రాంతాల్లో జరుగుతున్న సేవలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ వర్షాలు ముగిసిన నేపథ్యంలో పేరుకు పోయిన చెత్తాచెదారాలను త్వరితగతిన తరలించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. వరదనీటి నిల్వలు లేకుండా అన్ని ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో దోమలు ఉత్పత్తి కాకుండా అవసరమైన మందులను పిచికారీ చేయాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారమే ధ్యేయం

బౌద్ధనగర్: సమస్యల పరిష్కారానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ముందుంటారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. శుక్రవారం బీజేపీ నేతలతో కలిసి ఆయన డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన అంబర్ నగర్, అల్లాడి రాజ్‌కుమార్ నగర్‌లలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధిత కుటుంబాలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, వారికి బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

# 24/7 ఆన్ డ్యూటీ



వరదనీటిని తొలగిస్తున్న మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్..

- ప్రజలకు అండగా మాన్సూన్ బృందాలు
- ఎప్పటికప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీటిని తొలగిస్తున్న వైనం
- నాలా పరీవాహక ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ

సనత్‌నగర్: చినుకుపడుతుంటే లోతట్టు ప్రాంత ప్రజల గుండెలు గుభేలుమంటున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాలు నాలా పరీవాహక ప్రాంత కాలనీవాసులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. గతంలో వరదలు ముంచెత్తిన పలు సందర్భాల్లో తమకు ఎదురైన చేదు అనుభవాలే ఇంకా కళ్ల ముందు మెదులుతూనే ఉన్నాయి. అయితే ముంపుపై భయపడవద్దని, ఎప్పటికప్పుడు తాము అప్రమత్తంగా ఉంటూ వరద నీటిని బస్తీలు, కాలనీల నుంచి బయటకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు ప్రజలకు భరోసా కల్పిస్తున్నాయి. వర్షం వస్తే అందరూ ఎక్కడివారు అక్కడే ఉండిపోతారు. కానీ వారు మాత్రం తటాకాలను తలపించే రోడ్ల పైకి వచ్చి నీటిని తొలగించే ప్రక్రియలో తలమునకలవుతారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రధానంగా అమీర్‌పేట, బేగంపేట నాలా పరీవాహక ప్రాంతాల్లో వరద ముంపు ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మయూరిమార్గ్, అల్లంతోటబావి, బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ, చీకోటి గార్డెన్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్లతో పాటు అమీర్‌పేట డివిజన్‌లో అంకమ్మబస్తీ, హరిజనబస్తీ, గంగుబాయిబస్తీ, బుద్ధనగర్, లీలానగర్ బస్తీల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటోంది. బేగంపేట సర్కిల్ పరిధిలోని మెక్లేన్‌గూడ, నల్లగుట్ట, బాపుబాగ్ కాలనీ, లాలా టెంపుల్, సెయింట్ మేరీస్ రోడ్డు, రాణిగంజ్, కర్బలా మైదానం, ఎంజీ రోడ్డు గాంధీ విగ్రహం వద్ద తదితర ప్రాంతాల్లో నీరు నిలుస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వర్షం పడుతున్న ప్రతిసారీ డివిజన్ల వారీగా కేటాయించిన ప్రత్యేక మన్సూన్ బృందాలు రంగంలోకి దిగి ఎప్పటికప్పుడు వరదనీటిని తొలగిస్తున్నారు.

**ఒక్కో బృందంలో 6 నుంచి 10 మంది..**

సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, మోండా డివిజన్‌లలో ఒకటి చొప్పున మన్సూన్ బృందాలు విధుల్లో కొనసాగుతున్నాయి. అయితే డివిజన్లలో వాటర్ లాగింగ్ పాయింట్స్‌ను బట్టి బృందంలో సభ్యుల సంఖ్యను కేటాయించారు. ఒక్కో బృందంలో ఆరు నుంచి 10 మంది చొప్పున నియమించారు. వీరికి ఒక వాహనంతో పాటు వరదనీటి తొలగించేందుకు ఉపయోగించే పరికరాలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో షిఫ్టునకు ఎనిమిది గంటల చొప్పున రోజుకు మూడు షిఫ్టుల్లో 18 బృందాల ద్వారా సుమారు వంద మంది సిబ్బంది అత్యవసర విధులను నిర్వర్తిస్తున్నారు.

**ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ..**

వర్షం పడుతుందంటే అత్యవసర బృందాలు అప్రమత్తమవుతాయి. నీరు నిలిచే రహదారులు, బస్తీల్లోకి ఆయా బృందాల సభ్యులు చేరుకుంటారు. నీరు నిలవకుండా చేయడం, మ్యాన్‌హోళ్లను ఎత్తి నీటి ప్రవాహాన్ని తగ్గించడంపై దృష్టి పెడతారు. కూలిన చెట్లను, కొమ్మలను తొలగించడంతో పాటు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడతారు. వీటితో పాటు వర్షాలకు పాడైన రహదారులకు తక్షణ మరమ్మతులు చేయడం, రహదారుల పైకి కొట్టుకువచ్చిన మట్టి, బురద, ఇసుక తొలగించడం, మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్‌లకు అడ్డుగా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడం చేస్తారు. ఔట్‌లెట్ల వద్ద నీరు పొంగిపొర్లకుండా వ్యర్థాలను తొలగిస్తారు.

# టికెట్ కోసమేనా..?

- మర్రితో సాయన్న కుమార్తెల భేటీ
- పాల్గొన్న బోర్డు మాజీ సభ్యులు
- నియోజకవర్గంలో చర్చ
- టికెట్ కేటాయింపుపై స్పష్టత వచ్చినట్లేనని ప్రచారం
- 'బంధు'ల పందేరంలో వాటా కోసమా?



మర్రి రాజశేఖర్ రెడ్డితో సమావేశమైన సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత

కంటోన్మెంట్: అంతర్గత విభేదాలతో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు అర్ధంతరంగా ముగియగా, నాటి నుంచి ఎడమొహం పెడమొహంగా ఉంటున్న పార్టీ మెజారిటీ నేతలు ఒక్క తాటిపైకి వచ్చారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి కార్యాలయంలో శుక్రవారం ముఖ్య నేతలు భేటీ అయ్యారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదితలతో పాటు బోర్డు మాజీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న నేతల మధ్య వర్గ పోరు తీవ్రమతున్న నేపథ్యంలో ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి వారందరికీ సమదూరం పాటిస్తూ వచ్చారు. దీంతో ఎవరికి వారే సొంతంగా నియోజకవర్గం పరిధిలో పర్యటనలు చేస్తున్నారు. సాయన్న కుమార్తెలు సైతం మర్రితో సంబంధం లేకుండానే తమ పని చేసుకుంటూ ఉన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి భేటీ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఆసక్తికరంగా మారింది.

**బెడిసికొట్టిన ఐక్యతా రాగం**

ఫిబ్రవరిలో సాయన్న మరణంతో కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. అప్పటికే టికెట్ రేసులో ఉన్న కార్పొరేషన్ చైర్మన్లు క్రిశాంక్, గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లతో పాటు శ్రీగణేశ్‌లు తమ వంతు ప్రయత్నాలను తీవ్ర తరం చేశారు. దీంతో పార్టీలో వర్గపోరును తగ్గించే క్రమంలో పార్టీ అధినాయకత్వం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలను మర్రి రాజశేఖర్ రెడ్డికి అప్పగించింది. తొలినాళ్లలో అధిష్ఠానం ఆశించినట్లుగానే నేతలంతా మర్రి నేతృత్వంలోనే కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. బోయిన్‌పల్లి, మారేడుపల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్న సాయన్న కుమార్తెలు ఐదోవార్డు ఆత్మీయ సమ్మేళనానికి డుమ్మా కొట్టారు. దీంతో మిగతా ఆశావహులు సైతం సొంతంగానే నియోజకవర్గ పర్యటనలు మొదలుపెట్టారు. సాయన్న కుమార్తెల తీరుతో తీవ్ర అసహనంగా ఉన్న మర్రి వర్గానికి చెందిన బోర్డు మాజీ సభ్యులు సైతం వారికి దూరంగానే ఉంటూ వచ్చారు.

**మీటింగ్ మర్మమేమిటి?**

వచ్చే నెలలో నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, దళిత బంధు, బీసీ బంధు లబ్ధిదారుల ఎంపిక తదితర కార్యక్రమాలు కొనసాగే అవకాశం ఉంది. ఎమ్మెల్యే లేని కంటోన్మెంట్‌లో ఆయా పథకాలు ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలోనే కొనసాగుతాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సహజంగానే మళ్లీ బీఆర్‌ఎస్ నేతలు మర్రి కార్యాలయం బాట పట్టారు. సాయన్న బతికి ఉన్న సమయంలోనే పెద్ద సంఖ్యలో దళిత బంధు దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఆ సమయంలో దివంగత నేత పలువురికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సాయన్న వారసులు మర్రితో భేటీ అయినట్లు సమాచారం. అయితే తనను మొదటి నుంచీ నమ్ముతూ వచ్చిన బోర్డు మాజీ సభ్యుల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమమైనా సాగాలని మర్రి షరతు విధించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సాయన్న కుమార్తెలు తన కార్యాలయానికి వచ్చిన వెంటనే మాజీ బోర్డు సభ్యులనూ పిలిపించారు. అయితే నేతల భేటీలో ఏ మేరకు నిర్ణయం జరిగిందో తెలియరావడం లేదు. ఇదిలా ఉండగా, త్వరలో జరగబోయే ఎన్నికల్లో సాయన్న వారసులకు పార్టీ టికెట్ వస్తుందని ఆ వర్గం నేతలు ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రి, బోర్డు మాజీ సభ్యులతో భేటీ అందుకే జరిగిందంటూ పేర్కొంటున్నారు.

## హెపటైటిస్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది

గాంధీఆస్పత్రి: హెపటైటీస్ వైరస్ వల్ల సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వైద్యనిపుణులు పేర్కొన్నారు. ప్రపంచ హెపటైటీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ గ్యాస్ట్రోఎంట్రాలజీ, మైక్రో బయోలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రుల్లో చైతన్య ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ వైరస్ సోకిన పానీయాలు, ఆహారం, తీసుకోవడంతో హెపటైటిస్ వ్యాధి సంక్రమిస్తుందని, జ్వరం, వికారం, వాంతులు, కడుపు ఉబ్బరం, ఆకలి లేకపోవడం, బలహీనత, కళ్లు, మూత్రం రంగు మారడం, దురద వంటివి హెపటైటిస్ లక్షణాలన్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులకు నీడిల్ స్టిక్ ఇంజ్యూరీతో హెపటైటిస్ సోకే అవకాశం ఉందని, గాంధీ ఆస్పత్రిలో ఇప్పటికీ ప్రతిరోజు మూడు నుంచి నాలుగు హెపటైటిస్ కేసులు నమోదు అవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు హెపటైటిస్ సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెపటైటిస్ సోకిన తర్వాత పూర్తిస్థాయిలో నివారణకు మందులు లేవన్నారు. వన్ లివర్, వన్ లైఫ్ నినాదంతో గాంధీ ఆస్పత్రి, కాలేజీ ప్రాంగణాల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెపటైటిస్ వ్యాక్సినేషన్ డ్రైవ్, స్క్రీనింగ్ టెస్ట్, పీజీ వైద్యులకు పేపర్ ప్రజెంటేషన్, వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, గ్యాస్ట్రోఎంట్రాలజీ, మైక్రోబయోలజీ హెచ్‌ఓడీలు శ్రవణ్‌కుమార్, జ్యోతిలక్ష్మీ, డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, ఆర్‌ఎంఓ-1 జయకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మ, పలు విభాగాలకు చెందిన హెచ్‌ఓడీలు, వైద్యులు, వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. సీతాఫల్‌మండిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కుట్టి వెల్లోడి ఆస్పత్రిలో శుక్రవారం వైద్యాధికారులతో ఆమె సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర విష జ్వరాలను అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహ్మద్‌గూడ నాలా ప్రాంతం, మెడిబావి ఆర్య సమాజ్‌ల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సక్కుబాయ్, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ ఫణి, డాక్టర్ ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.

## పేద, అణగారిన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ



సనత్‌నగర్: దేశంలో పేదరిక నిర్మూలన, జాతీయ గ్రామీణ ఆరోగ్య సంరక్షణ మిషన్, కనీస గ్రామీణ ఉపాధి హామీ, సామాజిక అభ్యున్నతి, అందరికీ విద్య వంటి అనేక అభివృద్ధి పథకాలు కాంగ్రెస్ పార్టీయే ప్రవేశపెట్టి, అమలు చేసిందని, పేద, అణగారిన వర్గాల అభ్యున్నతే తమ పార్టీ లక్ష్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ పేర్కొన్నారు. ఎస్‌ఆర్ నగర్‌లోని బాపునగర్ బస్తీలో ఆమె కాంగ్రెస్ శ్రేణులతో కలసి పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. తవ్విన రోడ్ల పునరుద్ధరణ లేక గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిన రోడ్లను, షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభాలను ఆమె పరిశీలించారు. డ్రైనేజీ, మంచినీటి సమస్యలను స్థానిక ప్రజలనడిగి తెలుసుకున్నారు. బాపునగర్ బస్తీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ధ్వసమైన రహదారులు, పొంగిపొర్లుతున్న నాలాలు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల లేమితో బీఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ నాశనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ నేత శేఖర్, హక్కు సంస్థ వాలంటీర్లు సుధీర్ కుమార్, ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.



## ఇళ్లు కూలిన బాధితులను ఆదుకోవాలి



కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు లలిత

అడ్డగుట్ట: వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ లలిత అన్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అడ్డగుట్ట లోహియానగర్‌లోని ఓ ఇంటి పైకప్పు రేకులు కూలిపోయాయి. శుక్రవారం ఆమె సదరు ఇంటిని సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేకులు కూలిన సమయంలో అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## సహాయక చర్యలు చేపట్టాలి



లాలాపేటలో రోడ్లను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

లాలాపేట: భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ తార్నాక డివిజన్ అధ్యక్షులు రాము వర్మ అన్నారు. శుక్రవారం ఆయన తార్నాక డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, బస్తీల్లో పర్యటించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు నాలా పరీవాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేణుయాదవ్, వెంకటేష్‌గౌడ్,పోచయ్య, సుబ్బారావు, బిక్షపతి, గణేష్, శ్రీనివాసచారి, రామకృష్ణ, ఆకుల శ్రీనివాస్, అనిత, అనూష, శశి,కృష్ణమూర్తి, మహేశ్, గోవర్ధన్, ఉపేందర్, ప్రమోద్, కరుణాకర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బస్తీవాసులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు నోముల ప్రకాష్

బౌద్ధనగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నోముల ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన వారాసీగూడలోని మహ్మద్‌గూడ, ఎల్‌ఎస్ నగర్, గొల్ల పుల్లయ్య బావి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నోముల ప్రకాష్ మాట్లాడుతూ వర్షాల కారణంగా స్థానిక బస్తీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది నాలాల్లో ఎప్పటికప్పుడు పూడికలు తీయాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: మద్యానికి బానిసైన ఓ వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి(65) శుక్రవారం ఉదయం లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మద్యానికి బానిసైన అతను జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు పేర్కొన్నారు.

## ఉజ్జయిని మహంకాళికి వెయ్యి మందితో సాక



అమ్మవారికి సాక సమర్పిస్తున్న భక్తులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి శుక్రవారం వెయ్యి మంది మహిళలతో సాక సమర్పించారు. మహంకాళి బోనాల జాతరలో భాగంగా రంగంలో అమ్మవారు తనకు సాక సమర్పించడం లేదని చెప్పడంతో అధికార యంత్రాంగం ప్రత్యేకంగా దేవాలయం తరఫున సాక సమర్పించారు. ప్రతి శుక్రవారం ఐదు వారాల పాటు అమ్మవారికి అంగరంగ వైభవంగా సాక సమర్పించనున్నారు. వెయ్యి మంది మహిళా భక్తులు తలపై సాక తీసుకుని వచ్చి బాజా బజంత్రీలతో దేవాలయంలోని గర్భ గుడి ముందున్న అమ్మవారికి సాక సమర్పించారు. దేవాలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డితో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సాయిబాబా హట్స్‌లో పర్యటిస్తున్న బీజేపీ నేతలు

రసూల్‌పురా: భారీ వర్షాల కారణంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరశురాం అన్నారు. శుక్రవారం ఆయన బోర్డు పరిధిలోని 3, 4, 7, 8 వార్డుల్లోని పలు బస్తీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ నేతృత్వంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ వ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా డిజాస్టర్ బృందం అందుబాటులో ఉందని తెలిపారు. బస్తీల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని శానిటేషన్ విభాగం అధికారులను కోరారు. బీఆర్‌ఎస్ నేతలు బస్తీల్లోకి వస్తే వారిని సమస్యల పరిష్కారంపై నిలదీయాలన్నారు. కార్యక్రమంలో పలు బస్తీల స్థానికులు పాల్గొన్నారు.

## పొంగుతున్న డ్రైనేజీలు



అడ్డగుట్ట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు శుక్రవారం కాస్తా తగ్గుముఖం పట్టాయి. అయితే డ్రైనేజీలు మాత్రం పొంగిపొర్లుతున్నాయి. అడ్డగుట్ట డివిజన్లోని నార్త్‌లాలాగూడ, ఇందిరానగర్‌లలో డ్రైనేజీలు పొంగిపొర్లుతూ మురుగునీరు వరదను తలపిస్తోంది. దుర్గంధాన్ని తట్టుకోలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## హాస్పిటల్ ఏర్పాటు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తాం



రిలే దీక్షలో పాల్గొన్న నాయకులు

లాలాపేట: బస్తీలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వంద రోజులకు పైగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 'చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దాం' అంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 116 రోజులకు చేరాయి. శుక్రవారం రిలే దీక్షలో కాంగ్రెస్ నాయకులే వేముల శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య, ఏసి నర్సింహ్మా, బిఆర్‌ఎస్ నాయకులు ఓర్సు శేఖర్, ఓర్సు కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు సైతం లెక్క చేయకుండా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. హాస్పిటల్ ఏర్పాటు చేసే వరకు దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## 46 జీవోను రద్దు చేయించండి

ఉస్మానియా యూనివర్సిటీ: జీవో నంబర్ 46ను రద్దు చేయించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఓయూ జేఏసీ నేతలు వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం ఓయూ జేఏసీ నాయకులు ఏసుగంటి రాజునేత ఆధ్వర్యంలో పోలీసు ఉద్యోగాలకు పోటీ పడుతున్న అభ్యర్థులు కిషన్‌రెడ్డిని కలసి 46 జీవో వలన తెలంగాణలో అన్ని రకాల పోలీసు ఉద్యోగాలకు పోటీ పడుతున్న నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని వివరించారు. గతంలో 2016, 2018 నియామకాల్లో జీవో నంబరు 46 లేదన్నారు. కేవలం 2022 నోటిఫికేషన్‌ల్లో జీవోను అమలు చేయడం వలన వందలాది మంది నిరుద్యోగులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అభ్యర్థుల వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రి 46 జీవో రద్దుకు కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఓయూ జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

## రైల్వే కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

అడ్డగుట్ట: భారతీయ రైల్వేలో ఇటీవల కాలంలో ప్రవేశపెట్టిన ఔట్ కమ్ బేసిస్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్‌లోని నాంపల్లి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాప్, రైల్వే కార్యాలయాలలో అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరిలో అన్‌స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ కార్మికులు ఉంటారని, వారివారి హోదాలను బట్టి వేతనాలు అందజేస్తారన్నారు. కాని వీరికి కనీస వేతన చట్టం ప్రకారం అందాల్సిన వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఈ విషయంపై రైల్వే అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇకనైనా చట్ట ప్రకారం ప్రతీ నెలా 7వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని, అదే విధంగా పే స్లిప్పులు కూడా ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కార్మికుల బ్యాంక్ పాస్ బుక్‌లు, ఏటీఎం కార్డులు దగ్గర పెట్టుకొని పక్కువ వేతనాలు చెల్లిస్తున్న కాంట్రాక్టర్లు, అందుకు సహకరిస్తున్న రైల్వే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం, ఇదే విషయమై రైల్వే జీఎం కార్యదర్శి ముత్యాల నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో యూనియన్ నాయకులు శివకుమార్, కుమారస్వామి, అజయ్ బాబు, ఆర్. మల్లేష్, షామిలి, హరీష్, మంజుల, సాజిదా బేగం, ఈదమ్మ, సంజీవ, సునీత తదితరులు పాల్గొన్నారు.